# పేరు మీరే పెట్టండి

**అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.**

క్రోతి బస్‌స్టాప్ దగ్గర నుంచుని మాలాలి వెళ్ళేబస్ కోసం ఎదురు చూస్తున్నాడు అభిషేక్. బస్ ఆలస్యమయితే, తోటిప్రయాణీకుల ముఖాలవంక పరిశీలనగా చూస్తూ వారి ప్రవర్తనలను అంచనా వేయడం అతని హాబీ. ఇంతలో ఓ పదేళ్ళ అబ్బాయ్ చేతిలో ఒక పచ్చని కార్డు చూపిస్తూ డబ్బులు అడుక్కోడం అతని కంట పడింది. కొందరు కార్డు చదివి 'పాపం' అని జాలిపడుతూ పదో, ఇరవయ్యో పైసలు ఇస్తున్నారు ఇంకొందరు "బస్ రాక మేం ఛస్తుంటే నీదో వెధవగోల పోవయ్యా!" అంటూ విసుక్కుంటున్నారు. వాడు మెల్లగా అభిషేక్ దగ్గరకొచ్చి కార్డు అందించాడు. వాడికి మాటలు రావని, అమ్మానాన్న ఎవరూ లేరని, తోచినంత దానం చేసిపుణ్యం కట్టుకోమని కార్డులోవుంది. "నీకు మాటలురావా?" అభిషేక్ అడిగాడు. రావన్నట్టు తలూపాడు అడ్డంగా.

అభిషేక్ జేబులోంచి ఓ ఒక రూపాయి కాగితం తీసి వాడి చేతులో పుంచుతూ, "ఊరికే పాపం ఎంతమంది నడుక్కుంటావ్! ఈ పదిరూపాయలతో 'ఇవ్వాల్టికి సరిపెట్టుకో!" జాలిగా అన్నాడు, అంతే—

"సార్! ఒక్క రూపాయి కాయితం ఇది" చెప్పి నాలిక్కరుచుకున్నాడు ముష్టిపిల్లాడు-

"అదే నాక్కావాల్సింది! మాటలు రావని మోసం చేస్తావా? దొంగ వెధవ!" అంటూ ఇచ్చిన రూపాయి కూడా లాగేసుకున్నాడు అభిషేక్. *

—బి. రఘురామరాజు
(మహబూబ్‌నగర్)

*స్రవంతి నెం. 10లో ఈశీర్షికలో ప్రచురించిన కథకి రచయిత శ్రీ గోపరాజు రాధాకృష్ణ పెట్టిన పేరు: పాపం ..కర్ణుడు.*

*ఈ వారం ఈ శీర్షికలో కథల ఎన్నికల గెస్ట్ ఎడిటర్ :*



-శ్రీమతి అరణి

ఓ కథ రాయండి శీర్షికన వచ్చిన కథలన్నిటా 'తెర వెనుక', 'నే.చ.పె.చూ.సి.చే' మెరుగయినవి అన్పించి, ఈ రెంటినీ ఎన్నిక చేయడం జరిగింది. 'ఎ షార్ట్ స్టోరి డీల్స్ విత్ ఎ సింగిల్ సిట్యుయేషన్' అన్నది ఒకనాటి కథకి నిర్వచనమయితే స్రవంతి ఆ నిర్వచనాన్ని ఈ శీర్షికతో 'ఎ షార్ట్ స్టోరి డీల్స్ విత్ ఎ సింగిల్ డైలాగ్' గా మార్చ గలిగింది. అందుకు ఈ పత్రికను అభినందిస్తున్నాను.

సాహిత్యంలో కథానిక ప్రక్రియను నేను బాగా అభిమానిస్తాను. కథల్ని రాయడం కన్నా చదవడమంటే నాకు భలే ఇష్టం.

—అరణి

## తెర వెనుక

ఢిల్లీలో జాతీయ స్థాయిలో పోలీసు ఉద్యోగుల నాటక పోటీలు జరుగుతున్నాయి. కానిస్టేబుల్ స్థాయి నుండి కమీషనర్ల వరకూ ఆ నాటకాలలో పాల్గొంటున్నారు.

అంతకు ముందే జాతీయ స్థాయిలో రెండు సార్లు 'ఉత్తమ నటుడు'గా ఎన్నికైన కానిస్టేబుల్ సుబ్బారావు, స్వయంగా రాసి, దర్శకత్వం వహిస్తూ, అందులో ముఖ్య పాత్రను కూడా వేస్తుండటంతో, ఆ నాటకాన్ని చూడ్డానికి ప్రేక్షకులు విరగబడ్డారు.

నాటకం మొదలయింది. సీన్లు చకచకా సాగిపోతున్నాయి. క్లయిమాక్స్‌లో సుబ్బారావు 'ట్రాజెడీ' సీనుకు జీవం పోస్తున్నాడు. తాగి తాగి చివరికి చనిపోయే పాత్ర అది.

సీను ప్రకారం తాగుతూ, డైలాగ్స్ చెబుతూ, గుండెల్లో నొప్పిని అభినయిస్తూ నేలకొరిగి పోయాడు సుబ్బారావు. నాటకం అయిపోయినట్టు 'తెర' జారింది. మరు నిముషంలోనే కలకలం మొదలైంది. తెర వెనుక. కింపపడిన సుబ్బారావు తిరిగి లేవలేదు. 'పాత్రలో లీనమై నటించటంతో 'హెమరేజ్' రావటం వల్ల మరణించి ఉంటాడు' అని నిర్ధారించారు సహ నటులు. ఆ మహా నటుని ఆకస్మిక మరణంతో దిగ్భ్రాంతి చెందిన జనం అతణ్ణి చివరి చూపుగా చూసి 'నివాళి' అర్పించేందుకు తోక్కిసలాడుకుంటున్నారు.

సుబ్బారావు దేహంపై పడి దారుణంగా, గుండెలవిసేలా ఏడుస్తున్నాడు సబిన్స్పెక్టర్ శ్రీనివాస్. నాటకం క్లయిమాక్స్‌లో ఇద్దరూ కలిసి నటించాల్సి ఉంది. ఆ సీన్‌కి ముందు "గ్రీన్‌రూం"లోకి పిలిచి సుబ్బారావు అన్న మాటలు అతన్ని నిలువునా దహించేస్తున్నాయి.

"సార్...దయచేసి ఈ విషయం ఎవరితోనూ చెప్పకండి." ప్రమాణం చేయించుకున్నాడు సుబ్బారావు.

"క్రీడారంగంలో జాతీయ స్థాయిలో బహుమతి సంపాదిస్తే, వేలరూపాయల బహుమతులూ, ఉద్యోగాల్లో ప్రమోషన్లు ఇస్తుంది మన డిపార్ట్‌మెంట్. కానీ, ముప్ఫయ్ అయిదేళ్ళ నా జీవితాన్ని ఈ వృత్తికే అంకితం చేసి, నాటకరంగంలో రెండుసార్లు జాతీయస్థాయిలో ఉత్తమ నటుడిగా బహుమతి పొందినా, రెండుసార్లకీకలిసి వెయ్యి రూపాయలు నగదు తప్ప, నాకింకే ప్రోత్సాహమూ లభించలేదు....సార్... క్రీడారంగం కంటే ఏం తీసిపోయింది సార్...కళారంగం!! దేని గొప్ప దానిదే సార్!" క్షణం ఆగాడు సుబ్బారావు.

"నిజాయితీగా, ఈ ఉద్యోగంచేస్తూ ఆరుగురు ఆడపిల్లలకీ, ఓ అబ్బాయికీ తండ్రినవటం తప్ప, ఆర్థికంగా ఏమీ సాధించలేకపోయాను. పెద్దబ్బాయి ఇంటర్ చదువుతున్నాడు. నలుగురమ్మాయిలు పెళ్ళికెదిగున్నారు. నేనింకో వారం రోజుల్లో రిటైరవబోతున్నాను."

"సార్...డ్యూటీలో ఉండగా చనిపోయిన కానిస్టేబుల్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తుంది గదా మన డిపార్ట్‌మెంట్...నేను ఈ రోజు నాటకం వేయటాన్ని డ్యూటీలో ఉన్నట్లుగానే పరిగణిస్తారు. నేను సర్వీసులోనే చనిపోతే...మీరు నా డెత్ సర్టిఫికెట్ తీసుకుని మా అబ్బాయికి ఉద్యోగం వేయించాలి. నా మరణాంతరం వచ్చే డబ్బు, కనీసం ఒకమ్మాయి పెళ్ళయినా చెయ్యగలిగితే కాస్త తృప్తి నాకు. నాకీ సహాయం చేసి, మీరు నా కుటుంబాన్ని ఆదుకోవాలి సార్. నాటకంలో లాగే ఇంకో పదిహేను నిముషాల్లో జీవితంలో కూడా నా పాత్ర ముగిసిపోతుంది. అలాగని ఈ నాటకానికి అన్యాయం చెయ్యను. తప్పకుండా మన నాటకానికి ప్రథమ బహుమతి వచ్చేలా కృషి చేస్తాను...ఇంతటి బరువు మీపై మోపుతున్నందుకు నన్ను క్షమించండి" కళ్ళలో నీళ్ళు ధారగా జారిపోతుండగా, యస్.ఐ. శ్రీనివాస్ పాదాలని కళ్ళకద్దుకున్నాడు సుబ్బారావు-అతని చేతిలో ఓ కవర్ ఉంచి.

శ్రీనివాస్‌కి మాట పెగల్లేదు. నాటకంలో డైలాగుల్లా, విషయమంతా "గడగడా" చెప్పేసి, అతని మెదడుని మొద్దుబారేలా చేశాడు సుబ్బారావు.

"ఇంకో పావుగంటలో నేను చచ్చిపోగానే అవి సిద్ధం చేయించండి" చెప్పాడు సుబ్బారావు పౌడర్ అద్దుకుంటూ. అప్పటికి అతను "విషం" తాగి ఉన్నట్లు మాత్రం చెప్పలేదు.

సుబ్బారావు శరీరంపై పడి, మౌనంగా రోదిస్తున్న, 'యస్.ఐ' శ్రీనివాస్‌కి ఈ మాటలింకా చెవుల్లో గింగురుమంటున్నాయి.

—పవన్

(కడప)

**స్రవంతి నెం: 8లో ఇచ్చినవాక్యం**

**"ఇంకో పావుగంటలో నేను చచ్చిపోగానే అవి సిద్ధం చేయించండి." చెప్పాడు సుబ్బారావు పౌడర్ అద్దుకుంటూ.**

**ఆధారంగా రాసిన కథలు**

# వే..చ..పె..చూ..పి..చే

"ఇంకో అరగంటలో పెళ్లి వారు వస్తున్నారు వాడ్ని చూసుకోవడానికి. ఆ వెధవ బయటికి వెళ్తే కాళ్లు విరగ్గొడ్తానని చెప్పు"-విసురుగా వచ్చి చెప్పాడు గోవిందయ్య భార్య సరస్వతితో కొడుకు సుబ్బారావుకి కూడా వినబడేటట్లు-

"ఇంకో పావు గంటలో నేను చచ్చిపోగానే అవి సిద్ధం చేయండి" చెప్పాడు సుబ్బారావు పౌడరు అద్దుకుంటూ-

సుడిగాలిలా వెళ్లిపోతూ ఆ మాటవిని తక్షున ఆగిపోయాడు గోవిందయ్య.

"ఒరేయ్ నాయనా! ఏవిట్రా ఆ మాటలు...

"కన్నీళ్ళతో" అంది తల్లి.

"ఛావనీలే వెధవని, చావంటే ఏదో చేగోడి తినడం అనుకుంటున్నాడు కంమూచుంవె! ఛావనీ" మహా కోపంగా చెప్పాడు గోవిందయ్య.

"ఇదిగో...ఇదిగో...అలాంటి అర్థం పర్థంలేని తిట్లూ, ఆడపెళ్లి వారు పెళ్లిచూపులకి రావడం మొదలైనవి భరించలేకే నేను ఛస్తానంటున్నాను-కంమూచూంవె అంటే ఏమిటో, నలభై ఏళ్ళయి కాపురం చేస్తున్నావు...కనీసం నీకైనా తెలుసా అమ్మా...?" అసహనంగా అడిగాడు సుబ్బారావు.

"నాకేమిటి తెలుసు నాయనా-నా పెళ్లి నాటి నుంచీ యీ రకం మాటలు వింటున్నాను. పెళ్లి నాడు మా నాన్ననీ యిలాగే అన్నారు. పిసకాకయి అని"

"అంటే?"

"పిల్లను యివ్వగానే సరికాదు కట్నం యివ్వాలి-అనిట-కొంచెం సేపుపోతే ఆయన చెప్తారులే"...అంది తల్లి నిరాసక్తంగా-

"కంమూచుంవె అంటే అర్థం చేసుకోవడం బందరు లడ్డూ తినడం అనుకొన్నా! పురాపంకొముపె...." అని ఓ క్షణం ఆగి "దీనిక్కూడా అర్థం చెప్పాలి కాబోలు...కంమూచుంవె అంటే పంది కొక్కు ముక్కు వెధవా అనీ-అర్థం అయ్యిందా...ఇంతకీ నువ్వా పెళ్లిచూపులకి సిద్ధంగా ఉన్నావా లేదా? లేకపోతే..."

"నాన్నా...అమ్మా, నేనూ ఎలాగూ ఈ తిట్ల బాధ పడుతున్నాం, ఇంకో అమాయక ప్రాణిని కూడా తీసుకువచ్చిబలి చేయలేను నాన్నా అందుకే అంటున్నా...నే చ పె చూ సి చే..."

"అంటే ఏమిటో అఘోరించు..."

"అంటే నేను చచ్చేక పెళ్ళి చూపులు సిద్ధం చేయించండి" -అన్నాడు సుబ్బారావు—

"ఓకే,కట్" అన్నారు దర్శకులు జంధ్యాల. హాస్య భరితమైన ఈ సన్నివేశం ఉషీకిరణ్ మూవీస్ వారి "అమ్మాయి గారి అబ్బాయి" చిత్రంలోనిది. ఇందులో గోవిందయ్య వీరభద్రరావు, సుబ్బారావుగా వేలు, సరస్వతిగా కాకినాడ శ్యామల నటిస్తున్నారు ప్రముఖ రచయిత మల్లాదినవల "ఒక ఆమె-ఒక అతడు" ఆధారంగా తీసిన ఈ చిత్రంలో ఇంకా చంద్రమోహన్, సాక్షిరంగారావు, రాళ్ళపల్లి, రావికొండలరావు, పొట్టిప్రసాద్, నిర్మల, రమాప్రభ, శ్రీలక్ష్మి ప్రధాన తారాగణం. ఈ చిత్రం ద్వారా వినిత అనే నూతన నటిని తెలుగు తెరకి పరిచయం చేస్తున్నారు వేటూరి, రమేష్ నాయుడు, గౌతంరాజు, తోటతరణి, కాంభోజరావు, జంధ్యాల తెర వెనుక ప్రముఖులు. ఆంధ్రాలో స్రవంతి ద్వారా జనవరిలో విడుదల కాబోతోంది ఈ చిత్రం.

-సుధాలహరి

(విజయనగరం)

## ఓ కథ రాయండి

ఈ క్రింద ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథని రాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారితోషికం పంపబడుతుంది..

"గృహప్రవేశమయిన రెండేళ్ళకుకానీ ఇల్లుకట్టలేనండీ!" అన్నాడు వినయమూర్తి వినయంగా మామగారితో